క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. సంపత్‌కుమార్‌ను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి పూలమొక్క బహూకరించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు కమిషనర్‌తో జియ్యాని చర్చించారు. నగరంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

విధి నిర్వహణలో భద్రత తప్పనిసరి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మల్కాపురం: విధుల నిర్వహణలో ప్రతి కార్మికుడు భద్రత పాటించాలని సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. హెచ్‌పీసీఎల్‌లో గురువారం జరిగిన భద్రత అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ జిల్లా జడ్జి, పర్మినెంట్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సర్వీస్ చైర్మన్ వల్లభనాయుడు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్ వాడపల్లి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్ తదితరులు కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'లుక్స్' రాజశేఖర్‌కు ఈమా అవార్డు ప్రదానం



అవార్డుతో లుక్స్ రాజశేఖర్

మల్కాపురం: ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ లుక్స్ రాజశేఖర్ ఈమా అవార్డు అందుకున్నారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన ఆయన డ్యాన్స్‌లో అనేక అవార్డులు అందుకోవటమే కాకుండా పలు సినిమాలకు కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ వైజాగ్ (ఈమా) నగరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వెస్ట్రన్ డ్యాన్స్, సింగర్స్, యాంకర్స్, ఈవెంట్ మేనేజర్స్, క్యాటరింగ్, సౌండ్స్, రేడియో జాకీ, మెజీషియన్స్ తదితర విభాగాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. వెస్ట్రన్ డ్యాన్స్ విభాగంలో లుక్స్ రాజశేఖర్‌ను ఈ అవార్డు వరించింది. అలాగే వైజాగ్ డ్యాన్సింగ్ అంబాసిడర్‌గా లుక్స్ రాజశేఖర్‌ను నిర్వాహకులు ఎంపిక చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మర్రిపాలెం: జోన్-2 ఎన్ఎస్‌టీఎల్ పరిధిలోని 11 కేవీ కళింగనగర్, శాంతినగర్ ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కళింగనగర్ ఫీడర్ పరిధిలోని మాధవ స్వామి టెంపుల్ రోడ్డు, గడ్డప్ప ఎన్‌క్లేవ్, కళింగనగర్.. శాంతినగర్ ఫీడర్ పరిధిలో అంబేడ్కర్ నగర్, శాంతినగర్, నేతాజీ నగర్, గురజాడనగర్, ఎన్ఏడీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

ఈ రోడ్డు బాగుపడేనా..!



బుచ్చిరాజుపాలెంలో తాటిపూడి పైప్‌లైన్ రహదారి దుస్థితి



రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రహదారి

- అభివృద్ధికి నోచుకోని తాటిపూడి పైప్‌లైన్ రహదారి
- గోపాలపట్నం రహదారికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

గోపాలపట్నం: నిత్యం రద్దీగా ఉండే ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం రహదారికి ప్రత్యామ్నాయంగా తాటిపూడి పైప్‌లైన్ రోడ్డును అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా స్థానికులు కోరుతున్నారు. ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. 15 ఏళ్ల కిందట మెటల్ రోడ్డు వేసి వదిలేశారు. దీంతో ఇది మట్టి, గతుకులతో మిగిలిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారికి తాటిపూడి పైప్‌లైన్ రోడ్డు ప్రత్యమ్నాయంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఎన్ఏడీ ఆల్ఫా హోటల్ వద్ద నుంచి బాజీ జంక్షన్‌ను బుచ్చిరాజుపాలెం తాటిపూడి పైప్‌లైన్ రహదారి కలుపుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ మార్గంలో ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. దీన్ని బీటీ రోడ్డుగా మార్చితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో రూ.38 లక్షలతో బీటీ రోడ్డు వేసేందుకు జీవీఎంసీ నిధులు మంజూరు చేశారు. అయితే ఈ పనులు టెండర్ దశలోనే నిలిచిపోయాయి. ఆ తర్వాత నుంచి అటు అధికారులు.. ఇటు నాయకులు పట్టించుకోలేదు. దీంతో ఈ రహదారిని పలువురు ఆక్రమించి సొంత అవసరాల కోసం వాడుకుంటున్నారు. వాహనాల పార్కింగ్‌కు అనువుగా చేసుకుంటున్నారు. మట్టి రోడ్డు కావడంతో నిత్యం ఈ రహదారి అపరిశుభ్రం పేరుకుపోయి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ రహదారిని బాగు చేయాలని వారు కోరుతున్నారు.

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు



కప్పరాడ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

- వివిధ ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు

సీతంపేట: శిక్షా సప్తాహ్ డే-4లో భాగంగా గురువారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పద్య పఠనం, దేశభక్తి గీతాలాపన, భరతనాట్యంతో అలరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు టీడీపీ 26వ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ చేతుల మీదుగా నోట్ పుస్తకాలు, పెన్నులు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనరస, ఉపాధ్యాయులు ఎం.వి.ధర్మారావు, ఎం.ఎస్.వి.విశ్వనాథం, నిర్మల, పద్మలత, మాణిక్యం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్కిట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ కప్పరాడ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. థింసా నృత్యం, 'డ్రగ్స్-అపరిచిత వ్యక్తులు' అనే స్కిట్లను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. ఉపాధ్యాయులు జ్యోతి, కుసుమకుమారి, యు.కల్యాణి తదితరులు సాంస్కృతిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'శిశు ఆధార్'



శిశు ఆధార్ నమోదు చేస్తున్న విజయలక్ష్మి, షేక్ ఫరీద్

కంచరపాలెం: గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం టీచర్ టి.విజయలక్ష్మి పర్యవేక్షణలో శిశు ఆధార్ ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎస్‌సీ సెంటర్ సిబ్బంది షేక్ ఫరీద్ చిన్నారులకు ఆధార్ గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ చేపట్టారు. సుమారు 125 మంది పిల్లలకు పేర్లు, వివరాల నమోదు, దిద్దుబాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కంచరపాలెం పరిధిలో చిన్నారులకు ఆధార్ నమోదు చేసుకోవాలని తల్లిదండ్రులకు విజయలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో బి.కుమారి, కంచరపాలెం పాఠశాల సిబ్బంది, ఆర్పీ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

27వ వార్డులో బీసీజీ టీకాలు



వైద్యురాలు శ్రావణి పర్యవేక్షణలో బీసీజీ టీకాలు వేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో బీసీజీ టీకాలు వేశారు. వైద్యురాలు శ్రావణి పర్యవేక్షణలో ఏఎన్ఎంలు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని స్థానికులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'ఉక్కు'ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాల్సిందే..



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రజల సొత్తని, దానిపై రాష్ట్ర ప్రజలకు పూర్తి హక్కు ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కాదని, మొండిగా ముందుకు వెళ్లి ప్రైవేటీకరణ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1260వ రోజు ఆయన మాట్లాడారు. మూడోసారి అత్తెసరు మెజార్టీతో అధికారంలోకి వచ్చినా మోదీ, అమిత్‌షా ఆలోచనా ధోరణిని మార్చుకోలేదని మండిపడ్డారు. లక్షల కోట్ల విలువైన ప్రజాధనాన్ని లూటీ చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం అదే ధోరణితో ముందుకు వెళ్తే ప్రజల చీత్కారాలు తప్పవన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడం తప్ప వేరే మార్గం ఏదీ సరికాదన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, కె.శ్రీనివాసులు నాయుడు, ఏఐటీయూసీ నాయకులు కిడిమి రాజబాబు, ఎ.మసేనురావు, డొక్కా నరసింగరావు, నరేష్‌కుమార్, జి.జయ, తాండ్ర కనకరాజు, డి.దేముడు, గుమ్మడి నరేంద కుమార్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, జ్యోతి ప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరు



మాట్లాడుతున్న సత్యనారాయణ

పెదగంట్యాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరు సాగిస్తామని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. గాజువాక నియోజకవర్గ సీపీఐ సర్వ సభ్య సమావేశాన్ని స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో గురువారం జి.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే పోరాటాలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, తాండ్ర కనకరాజు, రాజబాబు, పోతన్న, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల రెండో విడత భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 27న ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు

మల్కాపురం: వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు హెచ్చరించారు. శ్రీహరిపురం కూడలిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపిన వారికి ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ఎదురయ్యే ప్రమాదాలు, కుటుంబ సభ్యులు పడే ఇబ్బందులను వివరించారు. తొలి తప్పుగా విడిచిపెడుతున్నామని, నిబంధనలు మీరకుండా వాహనాలు నడపాలని చోదకులకు ఎస్ఐ సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకుడు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. బాబాను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం సాయిబాబాకు పంచహారతులు ఇచ్చారు. భక్తులంతా సామూహికంగా సాయి సంకీర్తన ఆలపించారు. మంత్రపుష్పం జపించారు. బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణరావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

మర్రిపాలెం రైతుబజారును సందర్శించిన డీఎస్‌వో



రైతుబజారులో స్టాళ్లను పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశ్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజారును గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి సూర్య ప్రకాశ్ సందర్శించారు. బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం స్పెషల్ కౌంటర్‌లో విక్రయాలను అడిగి తెలుసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నందున, వినియోగదారుల సౌలభ్యం కోసం జిల్లాలోని అన్ని రైతుబజార్లలో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.181 ఉంటే, రైతుబజారులో రూ.160కే అందిస్తున్నట్లు చెప్పారు. రోజు వారీ అమ్మకాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. డీఎస్‌వో వెంట సర్కిల్-2 ఏఎస్‌వో, ఆర్ఐ కోమలి, రైతుబజారు ఈవో కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



గోపాలపట్నంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని మల్కాపురం సీపీఎం జోన్ కమిటీ నాయకుడు పి.పైడిరాజు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై గురువారం శ్రీహరిపురం సెంటర్ వద్ద నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ సర్కారు బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊసు గానీ, ప్రత్యేక రైల్వే జోన్ గానీ, రాష్ట్ర విభజన హామీలు గానీ ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రాభివృద్ధికి రూ.15 వేల కోట్లను కేంద్రం అప్పు ఇప్పించడమేంటని, అప్పు ఆశ చూపి రాష్ట్ర పాలకులకు కేంద్రం పంగనామాలు పెట్టిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు దీనిపై మాట్లాడి కేంద్రాన్ని ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.పెంటారావు, కె.నూకరాజు, జానీ, హుస్సేన్, దేవరాజు, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై సీపీఎం నిరసన

గోపాలపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం గోపాలపట్నం జంక్షన్‌లో సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలను నిరాశపరిచిందన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పుగా ఇస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. రాజధాని నిర్మాణానికి డబ్బులు గ్రాంట్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించమన్న ప్రకటన కూడా చేయలేదన్నారు. విభజన హామీలపై టీడీపీ, జనసేన ఎంపీలు పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు పి.అనసూయ, ఆర్.శ్రీనివాసరావు, సూర్యాకాంతం ఆర్.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

కంచరపాలెం: సీపీఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవన నుంచి దేవేంద్రనగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గానగర్, జాషువానగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసన తెలిపారు. జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు వరాలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సహకారం అందిస్తారని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తే.. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పచ్చ మీడియాలు వాస్తవాలు చెప్పకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ బడ్జెట్‌ను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పార్టీ జోన్ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, బి.ఎస్.చలం, బి.అప్పారావు, శంకరరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వార్డులన్నీ పరిశుభ్రంగా కనిపించాలి



టౌన్ కొత్తరోడ్డు వద్ద చెత్త వేసే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్



బౌడారా రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో

జగదాంబ : వార్డులన్నీ ఎక్కడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ 35వ వార్డులో పర్యటించి చెత్త వేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. బౌడారా రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త వేస్తున్న కారణంగా అక్కడ అపరిశుభ్రంగా ఉండటంతో వెంటనే పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. అదే విధంగా టౌన్ కొత్త రోడ్డులోని జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డులోని టింబర్ డిపోలున్న ప్రాంతాన్ని పరిశీలించి రహదారిపై ఉన్న దుంగలు తీసేసి పారిశుధ్యానికి సహకరించాలని వ్యాపారులను కోరారు. లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. ప్రతిరోజు సిబ్బంది పర్యవేక్షించి పారిశుధ్యంపై రిపోర్టు ఇవ్వాలన్నారు. అనంతరం జనతా బజార్, మున్సిపల్ స్టేడియం, వెలంపేట పోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల నేపథ్యంలో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మురుగు నీరు బయట ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు తొలగింపునకు జేసీబీలను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్ సింగూరు సత్యనారాయణ, సెక్రటరీలు పాల్గొన్నారు.

కళలకు పుట్టినిల్లు మన భారతావని

- వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ
- లంకెలపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు
- పాఠశాలల్లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మింది హైస్కూల్‌లో నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



లంకెలపాలెం పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



అక్కిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలలో సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థిని

అగనంపూడి: ప్రాచీన కళలకు పుట్టినిల్లు మన భారతదేశమని లంకెలపాలెం ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అన్నారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో మరుగున పడిపోతున్న మన భారతీయ సంస్కృతిని, సంప్రదాయ కళలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను ఆదరించాలని, ముందు తరాలకు అందించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, రాజశేఖర్, శ్రీను, పీడీ లక్ష్మిరాణి తదితరులు పాల్గొన్నారు.

- పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాటికలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పెద్దినాయుడు, సుధాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతీయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. బాలలు కోలాటం ప్రదర్శించారు. జానపద నృత్య ప్రదర్శనతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పందిరి కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుజాత, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్ఎం కుమారస్వామి ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్య రూపకం అలరించింది. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను విద్యార్థులు ప్రదర్శించారు.

- మింది జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం పీవీఎస్ఎస్ఎస్ ఆంజనేయ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. పలు కార్యక్రమాలు ఆలోచింపజేశాయి. నాటి ఉపాధ్యాయుల వేషభాషలను అనుకరిస్తూ విద్యార్థులు పంచెకట్టుతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.